

# నావెళ్ళిపోయింది

రంగయ్య తెల్లవారకముందే స్నానం చేసి ఉతికిన నీర్కావిపంచ కట్టుకుని, పంగనామాలు దిద్దుకుని రేవు పడవ దగ్గరకొచ్చేవాడు. తాతలు, తండ్రులు రంగయ్యకి తరతరాల ఆస్తిగా ఆ రేవు పడవనిచ్చారు. రంగయ్య ఆ పడవనే

నమ్ముకుని, ఆపడవే లచ్మిగా, ఆ పడవే కులదేవతగా భావించి కిష్ట ఈ వొడ్డునుంచి ఆ వొడ్డుకి జనాన్ని చేరేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

రేవులో కొస్తూనే లంగరెత్తి పడవలో వేసి పడవ **తల్లికి** మొక్కి, కిష్ట తల్లికి మొక్కి ఆపైన నాలుగు దోసెళ్ళ నీళ్ళెత్తి పడవమీద చిలకరించి, తలెత్తి పైకి చూస్తే తూరుపు కొండల వెనక బద్ధకంగా నిద్రలేస్తున్న సూరీడుకి మొక్కి, పక్కకి తిరిగి అమరేశ్వరాలయం శిఖరాన్ని చూస్తూ "శంభో" అని, ఆత్మ ప్రదక్షిణం చేసేవాడు. రంగయ్య పెట్టేది పంగనామమైనా చేసేది శివస్మరణే. ఆ పూజలూ దణ్ణాలూ అయ్యేదాకా జనం ఒడ్డునే కూర్చునేవారు. రంగయ్య "ముత్తయిదులు ముందెక్కండమ్మా" అనగానే ఆడవాళ్ళు లేచివచ్చి పడవకి పసుపురాసి కుంకం పెట్టి కొబ్బరికాయ తెస్తే కొట్టి క్రిష్ణలో వొదిలేవారు. లేకపోతే పళ్ళూ తాంబూలం కృష్ణమ్మకి అర్పించుకుని కుడికాలు ముందుపెట్టి పడవలో కొచ్చేవారు. వాళ్ళవెంట చెప్పులు చేతబట్టుకొని మగవాళ్ళు ఎక్కేవారు. ఆ పైన పడవ సాగేది.

ఇవతలొడ్డునున్న అమరావతికి కృష్ణ అవతలున్న వూళ్ళకి రంగయ్య రేవు పడవే వారధి. రంగయ్య పడవలో రకరకాల జనం ఎక్కేవారు. అల్లదుగో! ఆ పిల్ల బుల్లెమ్మ, కొత్తగా పెళ్ళయింది. పసుపుతాడు ఇంకా మాయలేదు. మెడనిండా గంధం. తలనిండా దవనం, కొత్తపట్టుచీర వొంటిన రెపరెపలాడ్తూంటే, మెళ్ళో కొత్త బంగారునగ గరగరలాడ్తూంటే ఆ చివరగా కూర్చున్న మొగుణ్ణి ఒక్కసారి చూద్దామని తన వాలుకళ్ళు తిప్పిందో లేదో- అబ్బ మధ్యన బోలెడంతమంది జనం! అంచేత కళ్ళు దించేసుకుని, కాలి మట్టెల్నే చూస్తూ కూర్చుంది. కాళ్ళకి మెరుస్తున్న గోరింటాకు గోళ్ళనే చూస్తూ కూర్చుంది. రంగయ్య గడవేస్తూ "ఏం బుల్లమ్మా! మమ్మల్ని మరిచి పోబోకేవ్! పుట్టింటి పేరు నిలుపు " అన్నాడు. ఆ మాటకి బుల్లెమ్మ గువ్వపిట్టల్లే ముడుచుకుపోయింది.

పడవ సాగుతూంటే అంచుమీద గడవేస్తూ తిరుగుతూ రంగయ్య అందర్నీ పలకరిస్తున్నాడు. "సుబ్బయ్యగారూ కందులు బాగా గిట్టుబాటయినాయా?"

"గింజ బాగానే దిగింది కాని ధర లేదయ్యా." అని సుబ్బయ్యంటే "నీ సొమ్మేం పోయిందయ్యా నీదంతా మారుబేరమేగా' ' అని చురకంటించి అటు గడేసుకుంటూ వెళ్ళేవాడు రంగయ్య.

అల్ల ఆమూల రంగమ్మ మూణ్ణెల్ల పసిపాపణ్ణి వొళ్ళో పెట్టుకుని మురిపెంగా చూసుకుంటూ కూర్చుంది. రంగమ్మకి కాపరానికొచ్చిన పదిసంవత్సరాలకి కాన్పొచ్చింది. ఇంతకాలం అత్తగారూ, ఆడబడుచులూ అనే మాటలు గుండెకోత పెట్టగా, తనతోపాటు కాపరానికొచ్చిన ఆడపిల్లలు ముగ్గురు నలుగురు పిల్లల్నెత్తుకుని తిరుగుతోంటే రంగమ్మకి దుఃఖం పొర్లేది. పాలిండ్లు పొంగేవి. ఇంతకాలానికి రంగమ్మ కడుపు పండింది. కళ్ళన్నీ కన్నవాడిమీద పెట్టుకు చూస్తూ "ఇందుకోసం బతికానయ్యా!" అన్నట్లు కరిగిపోతోంది రంగమ్మ. రంగయ్య గడేస్తూ అటొచ్చి "చెల్లెమ్మా! కొడుకు పేరేంబెట్టావ్?" అంటే "ఇంకెవరి పేరు దేవుడి పేరేకదన్నా" అని బదులు చెప్పింది. "పుట్టినోడు దేవుడే! అందుకే ఆలస్సెంగా పుట్టాడు" అంటూ అవతల పక్కకెళ్ళిపోయాడు రంగయ్య.

ఇంకోపక్క మొగుడు మీద కోపమొచ్చి అలిగి పుట్టింటికి పోతున్నది సూరమ్మ. కళ్ళొత్తుకుంటూ, ముక్కు పిండుకుంటూ, తనలో తను గొణుక్కుంటూ "ఆడి జిమ్మడ" అంటూ మెటికలిరుస్తుంటే రంగయ్య దగ్గరకొచ్చి మెల్లిగా "ఓస్ సూరమ్మా! సల్లబడవే, కట్టాలు కాస్సేపే ఉంటయ్యే! కాని కాపరం కలకాలం ఉండేదే! ఎల్లెల్లు పుట్టింటికెల్లే! మీయమ్మ నిన్ను సల్లబరిచి మంచిమాట చెప్పదా? నువ్వు తిరిగి రావా! సందేళ పడవకి నిన్ను మళ్ళీ మీ ఆయనకాడికి చేర్చనా?"' అన్నాడు.

ఇలా పడవలోని జనం నవ్వులూ, కన్నీళ్ళూ పంచుకుంటూ, వాళ్ళకి ధైర్యం చెబుతూ, వాళ్ళ సంబరాలకి తనూ పొంగిపోతూ జనాన్ని అవతల వొడ్డుకి చేరవేస్తూ వాళ్ళ జీవితాల్లో కలిసిపోయి బతికేవాడు రంగయ్య. వాళ్ళు తలా కానీ ఇస్తే సాయంత్రానికి అవన్నీ కూడగట్టుకుని తండ్రి చేసిన బాకీకింద జమగా, వసూల్లో మూడొంతులు సుబ్బయ్యకి కట్టి, మిగతా దాంతో నూకలు కొనుక్కునేవాడు.

ఓ అర్ధరాత్రివేళ సుబ్బయ్య గుమాస్తా వచ్చి రంగయ్యని లేపి పడవెయ్యాలన్నాడు. ఏం కష్టమొచ్చిందో అనుకుని అంతరాత్రివేళ రంగయ్య రేవులోకొస్తే సుబ్బయ్య అవతలొడ్డునున్నాడన్నారు. అవతలొడ్డుకి పడవ తీసికెల్తే అక్కడ సుబ్బయ్య, కొందరు మనుషులు, బస్తాలు, ఏవో సరుకులు ఉన్నాయి. జనం సరుకు పడవలో కెత్తుతుంటే "ఇదేమిటి?" అన్నాడు రంగయ్య. జొన్నలన్నాడు సుబ్బయ్య. కాదని అనుమానంగా చూశాడు రంగయ్య. "నోరుమూసుకు పడవెయ్యరా! లేకపోతే పీక పిసికేస్తాం" అన్నారు జనం. బిక్కచచ్చిపోయి కిక్కురుమనకుండా సరుకు చేరేశాడు రంగయ్య.

పొద్దున మళ్ళీ రేవులోకి రంగయ్యొచ్చాడు. కాని దిగాలుగా ఉన్నాడు. ఇంతలో ఓ వార్త గప్పుమంది. "సుబ్బయ్య ఇంట్లో దొంగసరుకు పట్టుకున్నారు " అని చిలవలు పలవలుగా చెప్పుకుంటున్నారు. రంగయ్య కుమిలిపోతున్నాడు. అందులో "నా పాపమూ ఉంది" అని చెప్పబోయి నోరు నొక్కుకున్నాడు.

నాలుగు రోజుల తర్వాత సుబ్బయ్య వూళ్ళోకొచ్చి ఈ దొంగరవాణా సమాచారం రంగయ్య వల్లే తెలిసిందని అనుమానించి రంగయ్య తండ్రి బాకీకింద రేవు పడవ జప్తు చేశాడు. రంగయ్య గొల్లుమన్నాడు. భోరు భోరున ఏడ్చాడు. "అయ్యా నా పడవతల్లి లేకుండా నేనుండలేనయ్యా! కిష్టలో గడెయ్యకుండా నేను బ్రతకలేనయ్యా! డబ్బులన్నీ మీరే తీసుకోండయ్యా! నేను మీకు వూడిగం చేస్తానయ్యా! నాపడవ నాకొదిలేయండయ్యా!" అని కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

సుబ్బయ్య వినలేదు. కిరాయి మనిషిచేత లంగరెత్తించి "పోనీరా పడవ" అని ఆజ్ఞాపించగా పడవ కిష్టలో సాగిపోతుంటే వొడ్డున రంగయ్య ఏడుస్తూ అన్నాడు. "ఇంతకాలం అందర్నీ అవతలొడ్డుకు చేర్చాను. బగమంతుడు నన్నీ వొడ్డునే వొదిలేశాడా!" అంటూ కూలిపోయాడు. *